క్లుప్తంగా

ఆర్‌బీకే ద్వారా రాయితీ విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : అరబుపాలెం ఆర్‌బీకే ద్వారా రైతులకు సోమవారం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించి వ్యవసాయంలో మంచి దిగుబడులు సాధించాలని అన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బొడ్డేడ బుజ్జి, శరగడం యోగి నాగేశ్వరరావు, గంగాధర్, వీఏఏ సత్య రవిరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థి కిట్ల పంపిణీ



తిమ్మరాజుపేటలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి భర్త కృష్ణారావు కోరారు. తిమ్మరాజుపేట హైస్కూల్ విద్యార్థులకు సోమవారం ఆయన విద్యార్థి కిట్లను అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అప్పలనరసమ్మ, భీమరశెట్టి శ్రీనివాసరావు, సూరిశెట్టి రాము తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పైడితల్లమ్మ పండగ నేడు..



పైడితల్లమ్మ అమ్మవారు

రాంబిల్లి : మండల కేంద్రంలో మంగళవారం పైడితల్లమ్మ అమ్మవారి పండగను నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి పండగను పురస్కరించుకొని భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేయనున్నారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

వనరులను కాపాడాల్సిన బాధ్యత మనదే



సమావేశాన్ని నిర్వహిస్తున్న తహసీల్దార్ అప్పలస్వామి

రాంబిల్లి : ప్రకృతి వనరులు తరలిపోకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై ఉందని తహసీల్దార్ అప్పలస్వామి అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఇసుక, కంకర, మట్టి అక్రమంగా తరలిపోకుండా చూడాలన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు.

తాళ్లపాలెం సంతలో షెడ్‌ల నిర్మాణానికి సన్నాహాలు



వారపు సంతలో తొలగించిన తాటాకు పాకలు

కశింకోట: తాళ్లపాలెం వారపు సంతలో వ్యాపారులకు షెడ్‌లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు వ్యాపారులు తాటాకు పాకల్లో దుకాణాలు నిర్వహించేవారు. గాలి, వాన సమయాల్లో అవి ఎగిరిపోయేవి. దీంతో వ్యాపారుల విజ్ఞప్తి మేరకు నాబార్డు సమకూర్చిన రూ.18.50 లక్షలతో వారికి రేకుల షెడ్‌లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే కొంత మేర తాటాకు పాకలను తొలగించారు.

ఇరుకు రోడ్డులో...ప్రాణాలు అరచేతుల్లో...

- ఘాట్‌రోడ్డులో ప్రమాదకర ప్రయాణం
- నానాటికీ శిథిలమవుతున్న రోడ్డు
- పెరిగిన వాహనాల రద్దీ... కలగా మిగిలిన రోడ్డు విస్తరణ
- ఏడు దశాబ్దాలుగా మారని రహదారి తీరు

బ్రిటిష్ పాలకులు నిర్మించిన ఘాట్‌రోడ్డు అది. అప్పట్లో చాలా తక్కువగా పదుల సంఖ్యలోనే వాహనాల రాకపోకలు ఉండేవి. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచింది. ఆ ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలు ఎన్నో రెట్లు పెరిగాయి. అయితే రోడ్డు మాత్రం కొంచెం కూడా మార్పులేదు. పైగా శిథిలావస్థకు చేరి కొంచెం కొంచెంగా నదిలోకి కూలిపోతోంది. విస్తరణ మాటెలా ఉన్నా సురక్షితంగా వెళతామన్న నమ్మకం కూడా లేదు. ఏళ్లు గడిచినా రోడ్డు విస్తరణ మాట వినిపించక మూడు మండలాల ప్రజల రాకపోకలకు నిత్యం అవస్థలు తప్పడం లేదు.



ప్రమాదకరంగా ఉన్న ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు

కోటవురట్ల : మండలంలో గొట్టివాడ శివారున సాబనాల కొండ, పందూరు శివారున ఇందేశమ్మ వాక ఘాట్‌రోడ్లు ఉన్నాయి. ఈ రెండు ఘాట్ రోడ్లు కొండలను ఆనుకుని ఒంపులు తిరుగుతూ ఏజెన్సీని తలపిస్తాయి. ఓ పక్క ఎత్తయిన కొండ, మరో పక్క సుమారు 25 అడుగుల లోతున వరాహనది ఉన్నాయి. సన్నటి దారిలో వాహనదారులు అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ఘాట్‌రోడ్డులో నర్సీపట్నం, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాలకు చెందిన ప్రజలు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు.

ట్రాఫిక్ ఇక్కట్లు..

ఘాట్‌రోడ్డు ఇరుకుగా ఉండడంతో భారీ వాహనాలు తప్పించుకునే క్రమంలో ఇక్కట్లు తప్పడం లేదు. ఒక్కోసారి భారీ వాహనాలు తప్పించుకునే వీలులేక గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. వెడల్పు తక్కువగా ఉండడంతో ఎదురెదురుగా వచ్చిన వాహనాలు వెనక్కి వెళ్లాల్సివస్తోంది. ఎక్కువగా వాహనాలు ఒకేసారి వస్తే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఘాట్‌రోడ్డు శిథిలం కావడంతో భారీ వర్షాలు కురిసినపుడు రోడ్డు నదిలోకి జారిపోతోంది. ఇలా రెండు చోట్ల రోడ్డు నదిలోకి కూలిపోవడంతో తాత్కాలికంగా అడ్డుగా గోడ కట్టి ఊరుకున్నారు. అపుడపుడు కొండపై నుంచి బండరాళ్లు రోడ్డుపైకి దొర్లుకు వస్తుంటాయి. వర్షాకాలం వస్తే చాలు భయపడుతూ రాకపోకలు సాగిస్తుంటారు.

కూలుతున్న రక్షణ గోడలు..

ఘాట్‌రోడ్డును అభివృద్ధి చేయకపోగా కనీస నిర్వహణ లేకపోవడంతో రక్షణ గోడ పలు చోట్ల కూలిపోతోంది. దాంతో వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా నదిలో పడి మృత్యువాత పడక తప్పదు. రోడ్డు చాలా వరకు శిథిలమై పెద్ద పెద్ద గోతులు పడింది. మూడు మండలాలకు వారధి అయిన ఈ ఘాట్‌రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వాహనాల రాకపోకలు పెరగడంతో తరచూ ట్రాఫిక్ సమస్య వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డును విస్తరింపచేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఘాట్‌రోడ్డును విస్తరించాలి..



ఇందేశమ్మవాక ఘాట్‌రోడ్డు శిథిలమైంది. రక్షణగోడ చాలా వరకు కూలిపోతోంది. ఘాట్‌రోడ్డు కూడా రెండు చోట్ల నదిలోకి జారిపోయింది. భారీ వరదలు వస్తే ఘాట్‌రోడ్డుకు ముప్పు ఉంది. రోడ్డు ఇరుకుగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య వస్తోంది. రాత్రి పూట ఆదమరిస్తే నదిలో పడి మృత్యువాత పడే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి ఘాట్‌రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలి.

– టి.నారాయణరావు, మాజీ సర్పంచ్, పందూరు

మాదే రాజ్యం..మేమే పాలకులం!

- స్థానిక ప్రజా ప్రతినిధులతో పనిలేదు
- విత్తనాల పంపిణీలో టీడీపీ నాయకుల పెత్తనం
- ప్రొటోకాల్‌కు మంగళం పాడిన అధికారులు

కోటవురట్ల: టీడీపీ అధికారంలోకి రాగానే అధికారులు ప్రొటోకాల్‌కు మంగళం పాడేశారు. ప్రజాప్రతినిధులు కాని టీడీపీ నాయకులను అందలం ఎక్కిస్తూ ప్రజాస్వామ్యానికి తిలోదకాలు ఇచ్చేశారు. పాలకవర్గ సభ్యులు లేకుండానే ప్రభుత్వ పరమైన కార్యక్రమాన్ని టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఓ పార్టీ కార్యక్రమంలా నిర్వహించేశారు. అధికారుల తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విత్తన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్బీకేలో వ్యవసాయాధికారి సరోజిని నిర్వహించగా ఈ కార్యక్రమంలో పాలకవర్గం సభ్యులు ఎవరూ కనిపించలేదు. పైగా టీడీపీ నాయకులు నానా హడావుడి చేసి విత్తనాల పంపిణీ చేశారు. వాస్తవానికి మండలంలో ఎంపీపీ, ఇద్దరు వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, 16 మంది ఎంపీటీసీలకు గాను 11 మంది ఎంపీటీసీలు వైఎస్సార్ సీపీకి చెందిన వారే. అదేవిధంగా మండలంలోని 25 గ్రామ పంచాయతీలు ఉండగా 22 మంది సర్పంచులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే కాగా స్థానిక సర్పంచ్ కూడా వైఎస్సార్ సీపీ మద్దతుదారుడే. అయినా విత్తన పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ కాని, వైస్ ఎంపీపీలు కాని, జెడ్పీటీసీ కానీ లేకపోవడం శోచనీయం. ప్రజా ప్రతినిధులు ఎవరూ లేకుండానే ప్రభుత్వ కార్యక్రమంతో సంబంధం లేని టీడీపీ నాయకులు హడావుడి చేయడం చర్చనీయాంశంగా మారింది. పైగా ఇందుకు అధికారులు వత్తాసు పలకడం కొసమెరుపు.



విత్తనాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

పాయకరావుపేట : యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలు కావద్దని సిఐ పి.అప్పలరాజు, ఎస్‌ఈబీ సీఐ ఎస్.ధర్మారావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతర్జాతీయ ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాల పైన, దుష్పరిణామాల పైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.దేవన్న పాల్గొన్నారు.

గ్రోయిన్ మరమ్మతుల కోసం జలదీక్ష



నీటిలో దిగి నిరసన తెలుపుతున్న రైతులు, సీపీఎం నాయకులు

ఎస్.రాయవరం : మండలంలో పి.ధర్మవరం వద్ద వరాహనదిపై ఉన్న పెదఉప్పలం గ్రోయిన్ వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు అన్నారు. మరమ్మత్తులకు గురైన గ్రోయిన్ వద్ద సోమవారం వినూత్నంగా నది నీటిలోనికి దిగి పలువురు రైతులతో కలిసి జలదీక్ష చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఈ గ్రోయిన్ నిర్మాణం చేసినప్పటి నుంచి తరచూ మరమ్మతులకు గురయ్యేదని, గడిచిన 8 ఏళ్లుగా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టక పోవడంతో రైతులకు సాగునీరు అందలేదన్నారు. శిథిలావస్థకు చేరిన గ్రోయిన్‌కు సీజన్‌లో రైతులు తాత్కాలిక మరమ్మతులు చేసుకున్నప్పటికీ ఫలితం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి గ్రోయిన్ మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ, సీపీఎం నాయకులు ఎం.రాజేష్, ఎం.రమణ, శ్రీను, శివ, బన్ని, సాయి, సత్తిబాబు, రామకృష్ణ ఉన్నారు.

ఇంటి వంటే ఒంటికి మేలు...



మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : డయేరియా వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం అవుతుందని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి వాసంతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో పెనుగొల్లు, సర్వసిద్ధి వైద్య సిబ్బంది అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో కలుషిత తాగునీరు, కలుషిత ఆహారం తినడం వల్ల ఎక్కువగా డయేరియా సమస్య వస్తుందన్నారు. ఈ సందర్భంగా 2బయట ఫుడ్ వద్దు... ఇంటి ఫుడ్ ముద్దు' అంటూ నినాదాలు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ప్రథమ చికిత్స కిట్ల పంపిణీ



దిమిలి హెచ్‌ఎంకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేస్తున్న మన ఊరు మన సేవ సభ్యులు

రాంబిల్లి: దిమిలి పరిసర గ్రామాల్లో గల ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలకు దిమిలి మన ఊరు మన సేవ సభ్యులు ప్రథమ చికిత్స కిట్లు అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ డాక్టర్ దేవీ ప్రసాద్ ఈ కిట్లు మన ఊరు మన సేవ సభ్యులకు అందజేయగా, వీటిని పాఠశాలలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొద్దపు మాణిక్యం, బండి గణేష్, బొద్దపు శ్రీను పాల్గొన్నారు.

పరదేశమ్మ తల్లి ఒడ్డు పండగ నేడు

దేవరాపల్లి: శంభు వానిపాలెంలో గ్రామ దేవత పరదేశమ్మ తల్లి ఒడ్డు పండగను మంగళ వారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మరకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి ఆలయా న్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అమ్మ వారి పండగను పురస్కరించుకుని గ్రామస్తులు తెల్లవారుజాము నుంచి దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

పోలీసులకు 125 స్టాపర్ బోర్డుల అందజేత



రామ్‌కో సిమెంట్ పరిశ్రమ నిర్వాహకులను అభినందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

- రామ్‌కో సిమెంట్ ప్రతినిధులను అభినందించిన ఎస్పీ మురళీకృష్ణ

కశింకోట: జిల్లాలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఉపకరించే స్టాపర్ బోర్డులను రామ్‌కో సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. మండలంలోని ఏఎస్ పేట గ్రామం వద్ద ఉన్న రామ్‌కో పరిశ్రమ సీఎస్సార్ నిధులు రూ.9 లక్షలతో జిల్లా పోలీసులకు 125 స్టాపర్ బోర్డులను సమకూర్చింది. వీటిని జిల్లా ఎస్పీకి సోమవారం పరిశ్రమ యాజమాన్యం తరఫున ప్రతినిధులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారి, రాష్ట్ర రహదారుల్లో బ్లాక్ స్పాట్ల వద్ద తరచుగా జరిగే రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ స్టాపర్ బోర్డులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ట్రాఫిక్, రోడ్డు భద్రతను దృష్టిలో పెట్టుకుని స్టాపర్ బోర్డులు అందించినందుకు పరిశ్రమ యాజమాన్యానికి, ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, బి.అప్పారావు(ఎస్బీ), రామ్‌కో సిమెంట్ పరిశ్రమ హెడ్ పి.వీరపాండ్యన్, అడ్మిన్ హెడ్ ఎం.కళాధర్, హెచ్‌ఆర్ ఎం.యువరాజు, అనకాపల్లి ట్రాఫిక్ సీఐ పైడపు నాయుడు, రూరల్ సీఐ ధనుంజయరావు, కశింకోట సీఐ ఎం.వినోద్‌బాబు, అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రామ్‌కో సిమెంట్ పరిశ్రమ సమకూర్చిన స్టాపర్ బోర్డులు

ఆదిలోనే గుర్తిస్తే 'సికిల్ సెల్' నియంత్రణ సులభం

అనకాపల్లి: సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి వంశపారంపర్యంగా సంక్రమిస్తుందని, వ్యాధిని మొదటి దశలో గుర్తించినట్లయితే ఆరోగ్యంగా జీవించవచ్చని తుమ్మపాల వైద్యాలయం సీహెచ్‌వో డి.శారద అన్నారు. మండలంలోని తుమ్మపాల సచివాలయం–2 పరిధిలో సికిల్ సెల్ ఎనీమియా, మలేరియా వ్యతిరేక మాసోత్సవం పురస్కరించుకుని ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్ సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా లక్షణాలు లేకపోయినా క్రమం తప్పకుండా స్పెషలిస్ట్ వైద్యులు, వైద్య సిబ్బంది సలహా మేరకు రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. శరీరంలో తగినంత నీటి శాతాన్ని పాటించాలన్నారు. వైద్యుల సలహాలు మేరకు సకాలంలో మందులు, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదన్నారు. జూన్ 1న ప్రారంభమైన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నెలాఖరు వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌పీహెచ్ ప్రియదర్శిని ఏఎన్ఎం జయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

మట్టి దందాపై కదిలిన యంత్రాంగం

- అక్రమ మట్టి తవ్వకాలు, నిల్వల పరిశీలన
- ఉన్నతాధికారులకు నివేదన

సాక్షి ఎఫెక్ట్..



మామిడివాడ వద్ద గల స్థలంలో చదును చేసిన మట్టిని పరిశీలిస్తున్న గనులు, రెవెన్యూ అధికారులు

రాంబిల్లి : అక్రమ మట్టి తవ్వకాలు, నిల్వలపై గనులు, భూగర్భ గనుల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు సోమవారం చర్యలకు ఉపక్రమించారు. సోమవారం 'యథేచ్ఛగా మట్టి దందా' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భూగర్భ గనుల శాఖ ఏడీ సుబ్బారాయుడు పర్యవేక్షణలో ఆర్ఐ స్వాతి మామిడివాడ, కొత్తూరు, గోకివాడ పరిధిలో మట్టి తవ్వకాలు, అనధికార లేఅవుట్లలో మట్టితో నింపి చదును చేసిన ప్రదేశాలను పరిశీలించారు. ఎంత మేర తవ్వింది , చదును చేసిందీ లెక్కించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆర్ఐ తెలిపారు. తహసీల్దార్ అప్పలస్వామి ఆదేశాల మేరకు వీఆర్వోలు సత్యనారాయణ, కుమార్ పట్నాయక్, గిరిజ పాల్గొన్నారు. కాగా సాక్షి కథనానికి మట్టి మాఫియా ఉలిక్కిపడింది. ఈ కథనం రావడంతో పొక్లెయిన్ యంత్రాలతో పాటు ట్రాక్టర్లను అక్కడి నుంచి తరలించారు.

మదుములు మరమ్మతులు చేయించరూ...



గోపాలపట్నం ఆవ మదుము గోడలు శిథిలమైపోయిన దృశ్యం

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామాల పరిధిలో గల పంట కాలువల మదుములు, డివిజన్ డామ్‌లు శిథిలమయ్యాయి. రైతులకు సాగునీరు సరఫరా జరిగే మదుములు, డివిజన్ డామ్‌లు శిథిలమైపోవడంతో సాగునీరు ప్రశ్నార్థకంగా మారుతుందని రైతులు వాపోతున్నారు. మండలంలో గల పంట పొలాలకు తాండవ రిజర్వియర్ ద్వారా విడుదలయ్యే తాండవ నది ద్వారా సాగునీరు సరఫరా జరుగుతుంది. తాండవ నది పై నిర్మించిన ముఠా, భూమి ఆన కట్టల ద్వారా ఆయా గ్రామాలకు చెందిన పంట పొలాలకు నీరు సరఫరా జరుగుతుంది. మదుము శిథిలం కావడంతో సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా ఆవకు ఏర్పాటు చేసిన మదుములు గోడలు శిథిలమై పడిపోతున్నాయి. ఆవలో నిల్వ వుండవలసిన నీటికి మదుము ఆధారంగా ఉంటుంది. ఈ మదుముల గోడలు శిథిలం కావడంతో, తలుపులు కూడా పడిపోతే నీరు నిల్వ లేకుండా పోతుంది. అధికారులు స్పందించి ఆవ మదుములు సకాలంలో మరమ్మతులు చేయించాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ ఏఈ శ్రీరామమూర్తిని సంప్రదించగా ప్రతిపాదనలు పంపించడం జరిగిందని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని అన్నారు.

ఉత్సాహంగా 'నేను బడికి పోతా'



తిమ్మరాజుపేట ఎంపీపీ-2 స్కూల్లో పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

మునగపాక : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తిమ్మరాజుపేట ఎంపీపీ-2 స్కూల్ హెచ్‌ఎం విజయవాణి కోరారు. నేను బడికి పోతా...కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని తిమ్మరాజుపేట స్కూల్లో అక్షరాభ్యాసం కార్యక్రమం ఏర్పాటు చేశారు. 22 మంది విద్యార్థులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలన్నారు. సీఆర్పీ లక్ష్మీనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ ఎం.కనకారావు, తండ్రులు కొయిలాడ నాగరాజు, రాము కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షురాలిగా తేజస్విని



బీజేపీ మండల ఉపాధ్యక్షురాలు తేజస్వినికి నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

మునగపాక : బీజేపీ మండల ఉపాధ్యక్షురాలిగా కాండ్రేగుల తేజస్విని నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు కాశేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. పదవులు పొందిన వారు పార్టీ బలోపేతం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బత్తిన సాయిరాం, బొడ్డేడ భాస్కర్, మళ్ల మల్లయ్యనాయుడు, సంపర భార్గవాచార్యులు, వరలక్ష్మి, గణేష్ పాల్గొన్నారు.

భీమవరం రోడ్డులో సోలార్ లైట్లు



భీమవరం రోడ్డులో సోలార్ లైట్లు ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

ఎస్.రాయవరం : గ్రామాల్లో ఉన్న రహదారులను ఆనుకుని సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం రైతులకు, వాహన చోదకులకు ఎంతగానో ప్రయోజనం ఉంటుందని ఎంపీపీ కోన లోవలక్ష్మి అన్నారు. మాజీ ఎంపీ భీశెట్టి సహకారంతో వచ్చిన సోలార్ లైట్లు సోమవారం ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎంపీపీ లోవలక్ష్మి చేతుల మీదుగా లైట్లు వెలిగించారు. గ్రామం శివారులో రోడ్డుకిరువైపులా గోకులపాడు నుంచి భీమవరం వరకు ఈ లైట్లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీటి విలువ ఒక్కొక్కటి రూ.2500 కాగా రూ.4 లక్షల విలువ చేసే లైట్లు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గరగా నూకరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గరగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

28న గురుకులం మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

దరఖాస్తుల స్వీకరణకు రేపటి వరకు గడువు



ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

దేవరాపల్లి: తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో 2024–2025 విద్యా సంవత్సరంలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు మిగులు సీట్లు భర్తీకి ఈ నెల 28న రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్ సోమవారం తెలిపారు. స్థానిక గురుకుల విద్యాలయంలో 6, 7, 8, 9 తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 22 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం జత చేయాలన్నారు. ప్రవేశ పరీక్ష 28న ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, గంట ముందుగా హాజరు కావాలన్నారు. పరీక్షకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు జెరాక్స్, బ్లూ లేదా, బ్లాక్ పెన్ మాత్రమే తీసుకురావాలని సూచించారు.